తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# యువకుడు ఆత్మహత్య

**ఓ కేసులో ముద్దాయిని వెతుక్కుంటూ**

**తిరుపతికి వచ్చిన విజయవాడ పోలీసులు**

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 20, ప్రభాతవార్త
తిరుపతి రూరల్ మండలంలో వేదాంతపురంలో ఉంటున్న నిందితుడు సూర్య ప్రభాస్ (20)ను వెతుక్కుంటూ పోలీసులు ఇంటికి వెళ్ళారు. పోలీసులను గమనించి ఇంటి తలుపులు వేసుకున్న ముద్దాయి సూర్య ప్రభాస్ పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మాహత్యాయత్నం పాల్పడ్డాడు. ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డ సూర్య ప్రభాస్‌ను రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూర్య ప్రభాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సూర్య ప్రభాస్ మృతితో భార్య, కుమారుడు అనాధలైయ్యారు.

## ఉత్సవమూర్తికి అంగుళీ సంధాన సంప్రోక్షణం

తిరుమల, నవంబర్ 20(ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమల ఆలయంలోని శ్రీరామ చంద్రమూర్తి ఉత్సవమూర్తి విగ్రహానికి చిన్నపాటి భిన్నాలను ఆగమోక్తంగా సవ రించేందుకు మంగళవారం, బుధవారం రెండురోజులు స్వామివారి ఎడమచేయి అంగుళీ సంధాన సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం ప్రత్యేక హోమం నిర్వహించి పూర్ణాహుతి, కళావాహన కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రబలుతున్న విషజ్వరాలు



**తిరుచానూరులో జరుగుతున్న ఫీవర్ సర్వే**
**ఇప్పటికి 49 డెంగ్యూ, 9 చికున్ గున్యా కేసులు నమోదు**
**ముందస్తు నివారణ చర్యలు చాలా అవసరం :దామినేడు పిహెచ్‌సి మెడికల్ అధికారిణి ఉదయశ్రీ**



తిరుచానూరు, నవంబర్ 19, ప్రభాతవార్త:
తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రమాదకర విష జ్వరాలు వ్యాప్తిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు స్థానిక మెడికల్ ఆఫీసర్ల ఆద్వర్యంలో ఏఎన్ఎమ్ ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాలలో ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా తిరుచానూరు పిహెచ్‌సి పరిదిలోని 24 సచివాలయాల పరిదిలో 11వ తారీకు సోమవారం నుండి 28వ తారీకు వరకు 13 రోజుల పాటు ఈ సర్వే చేపట్టనున్నారు. గత వారం రోజులు నుండి చేపడుతున్న సర్వేలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రమాదకర జ్వరాల బారిన పడుతున్నట్లు మెడికల్ ఆఫీసర్ ఉదయశ్రీ తెలిపారు. తిరుచానూరు పంచాయతీ దామినేడు పిహెచ్‌సి యమ్‌ఓ మాట్లాడుతూ దామినేడు పి.హెచ్.సి 24 సచివాలయాల పరిధి విస్తరించి వుందని, అన్ని ప్రాంతాలలో ఏఎన్.ఎమ్.లు సుగుణ, కుమారి, ఆశా వర్కర్ల ద్వారా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో 49 మందికి డెంగ్యూ, 9చికున్ గున్యా వంటి ప్రమాదాకర జ్వరాలు వచ్చాయని అన్నారు. ఇవియే కాక మలేరియా, నిమోనియా, విషజ్వరాలు, జలుబు వంటి వ్యాధులు బారిన పడుతున్నారని తెలిపారు. ప్రజలు ముందస్తు చర్యలతోతమ ఆరోగ్యాన్ని సురక్షితంగా కాపాడుకోగలమని ఆమె వివరించారు.

### డెంగ్యూ వ్యాధి : కారణాలు, ముందస్తు చర్యలు

డెంగ్యూ ప్రమాదకర విషజ్వరం. దోమ కాటు నుండి సంక్రమిస్తుంది. ఏడిస్ ఈజిప్టి అనే దోమకాటు ద్వారా ఈ జ్వరము వ్యాపిస్తుంది. వ్యాధి సంక్రమించిన అనంతరం దోమలు ఆ వ్యక్తినుండి ఇతరులకు వ్యాప్తి చేస్తుంటాయి. ఇవి అధికంగా పగటి పూట కాటు వేస్తుంది. ఈ జ్వరంకు ప్రత్యేకంగా ఎటువంటి మందులు లేవు.వాటి లక్షణాలకు మాత్రమే చికిత్స కలదు.

**లక్షణాలు:** రెండు రోజుల కన్నా ఎక్కువ రోజులు 102నుండి104డిగ్రీల వరకు అధిక జ్వరము,తలనొప్పి ,కాల్లు,చేతులు నొప్పులు,కండరాలు నొప్పులు ,కళ్ళ చుట్టూ తలనొప్పి రావడం అధికంగా వుంటుంది.కొందరికి నడుము నొప్పులు కూడా రావచ్చు. ప్లేట్లెట్స్ క్షీణిస్తుంది. సరైన సమయంలో చికిత్స అందకపోతే ప్రాణానికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

**జాగ్రత్తలు:** మంచినీటి నిల్వలను తొలగించాలి. నిల్వ వున్న నీటిని కప్పి వుంచాలి.దోమల విరుగుడు లిక్విడ్స్,క్రీమ్ ద్వారా అరికట్టవచ్చు.బహిరంగ ప్రదేశాలలో ఆడుకునే పిల్లల కాళ్లకు, చేతులకు సాక్సులు ధరించాలి.

### చికున్ గున్యా: కారణాలు, ముందస్తు చర్యలు

చికున్ గున్యా దోమకాటుతో సంక్రమిస్తుంది. ఏడెస్ ఈజిప్టి, ఏడెస్ ఆల్బోపిక్టస్ అనే దోమ దాడి ద్వారా చికున్ గున్యా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవడం చాలా అవసరం.

**లక్షణాలు:** అధిక జ్వరం, కాళ్ళ కీళ్ళనొప్పులు,వాపులు,నడవలేక పోవడం,కాళ్ళు మడవలేక పోవడం,గొంతునొప్పి,శరీర బాగాలు పట్టేసినట్లు వుండటం,బలహీణత రావడం,లేవలేక పోవడం, కళ్ళు ఎర్రబడటం,కాళ్ల చేతుల మీదుగా దద్దుర్లు,మోకాళ్ల,మణికట్టు, చేతి కీళ్ళు వాపు రావడం,శరీర బాగాలు కదిలించటానికి ఇబ్బంది కలిగించుట ఈ వ్యాధి లక్షణాలు.

**నివారణ:** మంచి నీటి నిల్వలను తొలగించాలి,దోమల దాడినుండి కాపాడుకోవాలి, సమతుల్య పోషక ఆహారాన్ని తీసుకోవాలి.చిన్న పిల్లలు వృద్దులకు రోగనిరోధక శక్తి తక్కువ వుండటంతో వారు మరింతగా నిండు వస్త్రాలు, కాళ్ళకు చేతులకు సాక్సులు దరించాలి.

# నెలాఖరుకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి!?

శ్రీకాళహస్తి,నవంబర్ 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరుని ధర్మకర్తల మండలి ఈ నెలాఖరుకు జివో వస్తుందని తెలుగుదేశం వర్గాలు భావిస్తున్నాయి. మూడు రోజుల ముందు శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శాసన సభ్యుడు అమరావతిలో పట్టుదలగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే బోర్డులో సభ్యత్వాల కోసం శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లాలోని పొరుగున ఉన్న సత్యవేడు, నగరి, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి కూడా నాయకులు అధిష్టానంపై వత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఉన్న సమాచారాన్ని బట్టి ఉమ్మడి పార్టీల్లో బిజెపికి 1 జనసేనకు 2 బోర్డు సభ్యులకు అవకాశం ఉండవచ్చునని భావిస్తున్నారు. చైర్మెన్‌గిరి ఆయనకే అని ప్రచారం జరుగుతున్న మాజీ శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు రాజధాని నగరంలోనే కూర్చొని శాసనసభ్యుని



ఆదేశాల మేరకు ఫైళ్ళను కదుల్చుతున్నారు.

### 25నే ప్రమాణస్వీకారం అనుకున్నారు?!

శ్రీకాళహస్తీశ్వరుని ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఈ నెల 25నే జరపాలని ఆ రోజు బాగుందని భావించారు. ఈ మేరకు అంతర్గతంగా భావించారు.కానీ జివో విడుదల అయిన తరువాత దేవాదాయశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. దాంతో ఆలస్యం జరగవచ్చునని నెలాఖరుకు 'స్వర్ణమ్మ హారతులు' నాటికి కొత్త పాలక మండలితో కార్యక్రమాలు జరపవచ్చునని ఊహాగానాలు సాగుతున్నాయి. గతంలో 15 మంది ఉన్న బోర్డులో కొత్తగా ఇద్దరిని చేర్చారు. ఇందులో బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరు, నాయి బ్రాహ్మణుల సామాజిక వర్గం నుంచి ఒకరు చేర్చారు. దాంతో సభ్యుల సంఖ్య 17కు పెరిగింది.ఈ బోర్డులో 40శాతం మహిళలకు కేటాయించాల్సి ఉంది. అంతేకాక వివిధ సామాజిక వర్గాల రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. దాంతో శాసన సభ్యులు ఆచి తూచి అడుగులేయాల్సి ఉంది. తన నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక నామినేటెడ్ పదవులు అవకాశం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి. ఇందులో వివిధ పార్టీలు, నాయకులకు పోను శాసనసభ్యునికి 8 లేదా 9 పదవులు మాత్రమే దక్కే అవకాశం ఉంటుంది. మరి వాటిలో ఏ సామాజిక వర్గానికి అవకాశం వస్తుందో వేచి చూడాలి.అయితే ఎంఎల్ఏ పై వివిధ వర్గాల వత్తిడి పెరుగుతుంది. నెలాఖరుకు శ్రీకాళహస్తీశ్వరుని ధర్మకర్తల మండలి ఖాయమనే చర్చ జరుగుతుంది.

# వైభవంగా కార్తీక బహుళ పంచమి వేడుకలు



స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన ఉభయదారులు, భక్తులు

కాణిపాకం, నవంబర్ 20 ప్రభాతవార్త:
సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం కార్తీక బహుళ పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పులిచెర్లకు చెందిన పోకల అశోక్‌కుమార్ కుటుంబీకులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈమేరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకారమండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి అలంకరించి ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు కళ్యాణోత్సవంకు కావాల్సిన పూజాసామాగ్రిని ప్రధాన ఆలయం నుండి మంగళవాయిద్యాల నడుమ అలంకారమండపంకు తీసుకువచ్చి అర్చకులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉభయదాతలు పోకల అశోక్‌కుమార్ కుటుంబీకులు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి,

# తీరప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు

**ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్**



గూడూరు, నవంబర్ 20, ప్రభాతవార్త
తీరప్రాంతాలైన చిల్లకూరు మండలం తమ్మినపట్నం పంచాయతీ గుమ్మలదిబ్బ నుండి బీచ్ వరకు బిటి రోడ్ కొరకు 3 కోట్ల 11 లక్షలు మంజూరు చేశారని ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కి, ఇంచార్జ్ మినిష్టర్ అనగాని సత్య ప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. వాకాడు మండలం జమీన్ కొత్తపాలెం పంచాయతీ తూపిలి పాలెం గ్రామం నుండి బీచ్ వరకు బిటి రోడ్ కొరకు 66 లక్షలు మంజూరు చేశారన్నారు. వాకాడు మండలం దుగ్గరాజపట్నం పంచాయతీ కొండూరు పాలెం గ్రామం నుండి బీచ్ వరకు బిటి రోడ్ కొరకు 37 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. దీనివలన తీరప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలోనే రాష్టంను అభివృద్ధి పథంలోకి నడిపిస్తున్న విజన్ కలిగిన నాయకులు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలలలోనే నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అలాగే విజయవాడలో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్‌ని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్ కలిసి

# చిత్తూరు ఆసుపత్రికి ఆధునిక అంబులెన్స్

**- ఎమ్మెల్యే జగన్మోహన్‌నాయుడు వినతి మేరకు సిఎంఓ నుండి ఆదేశాలు**



చిత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త:
చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌లను కేటాయించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు బుధవారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం పాత అంబులెన్స్ వుందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన, ఎమర్జెన్సీ సేవలు సైతం అందించే అంబులెన్స్‌లను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించాలని కోరారు. ప్రధానంగా అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, వెంటిలేటర్ సౌకర్యలం కల్గిన కార్డియాక్, బేసిక్ లైఫ్ సపోర్ట్ కల్గిన జిపిఎస్ అంబులెన్స్‌లను అవసరమైన నిధులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించాలని ఎమ్మెల్యే సిఎంను కోరారు. అలాగే జాతీయ రహధారిలో వున్న గుడిపాల పిహెచ్‌సిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సిఎం నారా చంద్రబాబునాయుడుకు విన్నవించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు విన్నపాలను ఆలకించిన సిఎం నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, వెంటిలేటర్ సౌకర్యం కల్గిన కార్డియాక్ బేసిక్ లైఫ్ సపోర్ట్ కలిగిన జిపిఎస్ అంబులెన్స్‌ల కోసం నిధులు కేటాయించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, గుడిపాల పిహెచ్‌సి కేంద్రంను సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేయడం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిన ప్రతిపాదనలు పెండింగ్‌లో వున్నాయని ఈ విషయంను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రాణం తీసిన వేగం..

**విషాదయాత్రగా మారిన విహారయాత్ర..!**



ప్రమాదంలో మృతి చెందిన హర్ష వెంకట వరుణ్, మృతుడి ఫైల్‌ఫోటో

గంగవరం, నవంబరు 20, ప్రభాతవార్త
అతివేగం ప్రాణం తీస్తుందని అధికారులు చెప్పినా,హోర్డింగులు పెట్టినా, జరిమానాలు విధిస్తున్నా యువతలో మాత్రం స్పీడు తగ్గడం లేదు.దాని ప్రభావం ఎలా ఉంటుందో బుధవారం గంగవరం మండలంలో జరిగిన దుర్ఘటనే నిదర్శనం. స్పీడ్ బైక్ రైడర్స్ అయిన మిత్రులతో కలిసి కర్ణాటక రాష్ట్రంలో కూర్గ్ ప్రాంతంలో పర్యటించాలని అనుకున్న యువకున్ని మార్గమధ్యంలోనే మృత్యువు కౌగిట్లోకి తీసుకుని వెళ్ళిన హృదయ విదారకమైన విషాద యాత్రగా మారిన విహారయాత్ర సంఘటన ఇది.గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా..కృష్ణా జిల్లా నందిగామకు చెందిన తాటి శ్రీను కుమారుడు హర్షవెంకటవరుణ్(19),ఇతని మిత్రులు రాజమండ్రికి చెందిన వినయహ(22),మండపేటకు చెందిన రాహుల్(21),కావలికి చెందిన లథీఫ్(20)లకు బిఎండబ్ల్యు వాహనాలు కలిగి ఉండడంతో సోషల్ మీడియలో బిఎండబ్ల్యు అనే గ్రూపు ద్వారా పరిచయమై మిత్రులుగా ఏర్పడ్డారు.ఈ నేపథ్యంలో నలుగురు మిత్రులు కలిసి తమ బిఎండబ్ల్యు ద్విచక్రవాహనాల్లో బైక్ రైడ్ చేసుకుంటూ కర్ణాటక రాష్ట్రంలో కూర్గ్ ప్రాంతంలో పర్యటించడానికి మంగళవారం బయల్దేరి అందరూ నెల్లూరు చేరుకున్నారు.రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం నెల్లూరు నుండి విహార యాత్రకు వస్తూ మండలంలోని బెంగళూరు,చెన్నై జాతీయ రహదారిపై దండపల్లె క్రాస్ వద్దకు రాగానే దండపల్లె వైపు నుండి పలమనేరుకు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో రోడ్డు దాటుతుండగా హర్షవెంకటవరుణ్ వేగంగా వస్తూ ఆటోను డీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో హర్షవెంకటవరుణ్ కాళ్ళు,చేతులు విరిగి,తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు.విషయం తెలుసుకున్న సిఐ ప్రసాద్,పలమనేరు ఎంవిఐ మధుసూదన్‌లు వెంటనే సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడి తొందర పాటు కన్నవారికి కడుపుకోత మిగిల్చింది.ఎదిగొచ్చిన కొడుకు రోడ్డుపై విగత జీవిలా పడిఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

# వర్షాలతో ఆర్టికల్చర్ రైతులకు మిగిలిన కన్నీరు



దొరవారిసత్రం, నవంబర్ 20 ప్రభాతవార్త:
తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలో ఎక్కువగా ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.మండల పరిధిలో వరి పైరుతో పాటు మెట్టప్రాంతం రైతులు అధిక సంఖ్యలో ఆర్టికల్చర్ సాగుకు చెందిన వంగ, బెండ, చిక్కుడు,కాకర,మిరప మొదలైన ఉద్యానవన పంటలను అధికమొత్తంలో పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్నారు. కానీ గత వారంరోజులుగా కురిసిన భారీ వర్షాలకు కల్లూరు, పోలిరెడ్డిపాలెం, అక్కరపాక, కుప్పారెడ్డిపాలెం మొదలగు గ్రామాలలో బెండ, మిరప,వంగ పంటలు పూత,కాపు దసలో నీటమునిగి అధిక తేమతో చనిపోవడంతో రైతులు కన్నీరు పర్యత మవుతున్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులు పలుమార్లు సంబంధిత వ్యవసాయ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవట్లేదని వాపోయారు. వ్యవసాయ అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు కానీ, గ్రామాలకు వచ్చి రైతుల పొలాలను సందర్శించడంలేదని ప్రజలు తమ ఆవేదనను వ్యక్త పరుస్తున్నారు. పంటనష్టాన్ని అంచనావేసి రైతులను ఆదుకోవాలని వాపోయారు.

## జిల్లాలో 3 ఇసుక యార్డుల కోసం లాటరీ పద్ధతి ద్వారా ఎన్నిక

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 20, ప్రభాతవార్త
జిల్లాలో 3 ఇసుక యార్డుల కోసం లాటరీ పద్ధతి ద్వారా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా .ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి బుధవారం ఇసుకస్టాక్ యార్డుకు సంబంధించి లాటరీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక యార్డుల కోసం లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆవిలాలకి సంబంధించిన లీల ఎంట ర్ప్రైజెస్ స్టాక్ యార్డ్ పి శైలజ, కాటన్ మిల్‌కు సంబంధించి పి శ్రీనివాసులురెడ్డి, గాజులమాన్యం రేణిగుంట మండలం సంబంధించి తిష్య కన్స్ట్రక్షన్స్ కే.శ్రీనివాసులను లాటరీ పద్ధతి ద్వారా వీరిని ఎంపిక చేయడం జరిగిందని అన్నారు.

## ముగిసిన ముక్కోటి మహోత్సవాలు

**వైభవంగా త్రిశూల స్నానం, పోటెత్తిన భక్తజనం**

చంద్రగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త:



స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారి కార్తీక మాస ముక్కోటి మహోత్సవాలు బుధవారం త్రిశూల స్నానంతో వైభవంగా ముగిశాయి. వేకువజామున అగస్త్యేశ్వర స్వామి, ఆనందవల్లీ అమ్మవారికి అభిషేకాధులు నిర్వహించి, విశేష అలంకరణలు గావించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలోని పుష్కరిణీలో అర్చకులు త్రిశూలస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించి ఉత్సవాలను ముగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పుష్కర స్నానానికి పోటీపడ్డారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో ధ్వజఅవరోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.

# శ్రీకాళహస్తి ఆసుపత్రి,హాస్టల్స్ దుస్థితిపై అసెంబ్లీలో చర్చ

శ్రీకాళహస్తి,నవంబర్ 20 ప్రభాతవార్త
వైకాపా ప్రభుత్వం హయాంలో అసెంబ్లీలో శ్రీకాళహస్తి సమస్యలకు సంబంధించి ప్రస్తావన లేదు. చంద్రబాబునాయుడుపై వ్యంగ్య చలోక్తులు, ఛాలెంజ్‌లతో గడచింది. పుణ్యక్షేత్రంలో సమస్యలపై ప్రస్తావనే లేదు. బుధవారం జరిగిన సమావేశంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి రెండు ప్రధాన సమస్యలపై చర్చ జరిపారు. సంబంధిత శాఖ మంత్రులు స్పందించాలని కోరారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో 1999లో అప్పటి ఉమ్మడి రాష్ట్రం ఇప్పటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సుమారు11 ఎకరాల విస్తీర్ణంలో రూ.5కోట్లుతో వంద పడకల ఆసుపత్రిని నిర్మింపజేసారు. అప్పటి శాసనసభ్యులు, మంత్రి గోపాలకృష్ణారెడ్డి సారధ్యంలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఏర్పాటుచేసారు. 2014-19లో



శాసనసభలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

గోపాలకృష్ణారెడ్డియే కృషి చేసి డయాల్సిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసారని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. 2019 నుంచి వైకాపా ప్రభుత్వం రూ.15కోట్లు అభివృద్ధి పేర వెచ్చించింది. కానీ ఇక్కడ నేడు పరిస్తితి దయనీయంగా ఉంది. డయాల్సిస్ కేంద్రానికి డాక్టర్లు లేదు. ఇక్కడ ఆక్సిజన్ సిలిండర్ లేదు. ఆసుపత్రిలో కనీసం జనరేటర్ పని చేయదు. వైకాపా ప్రభుత్వంలో నిర్మించిన అదనపు భవనాలు కొద్దిపాటి వర్షానికే ఉరుపు ఇదీ పరిస్థితి నిరుపేదల ఆసుపత్రికి సమస్యల జబ్బు పట్టుకుందన్నారు. ఇక్కడ వైద్యఆరోగ్యశాఖ మంత్రి స్పందించి నిధులు మంజూరు చేసి శస్త్ర చికిత్స జరపాలని కోరారు.ఇక నిరుపేదల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణ లేదు.వసతి గృహానికి ప్రహారీ గోడ లేదు. 236 మంది విద్యార్థులకు తగిన మరుగుదొడ్లు లేదు. కనీసం పది మరుగుదొడ్లు అయినా ఇక్కడ అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి స్పందించాలని కోరారు.

# కోసలనగరాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయండి

విజయపురం, నవంబరు 20 ప్రభాతవార్త:
నగరి నియోజకవర్గంలోని విజయపురం మండల పరిధలో కోసలనగరం ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం శాసన సభ సమావేశాల సందర్భంగా జీరో అవర్‌లో మాట్లాడారు. కోసలనగరం ప్రాంతంలో ఏపీఐఐసీ సుమారు 2500 ఎకరాలు పరిశ్రమల స్థాపన కోసం కేటాయించింది. ఈ ప్రాంతానికి చెన్నై అతి దగ్గరగా ఉండడమే కాక రవాణా సౌకర్యాలకు మైవే రహదారులు, తిరుపతి, చెన్నై విమానాశ్రయం, చెన్నై పోర్టు అందుబాటులో ఉండడం, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైందని, ఇక్కడ ప్రభుత్వం పరిశ్రమలు పెట్టి ఈ ప్రాంత అభివృద్ధికి, యువతకు ఉద్యోగాల కల్పనకు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ



శాసనసభలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అనువైందని గతంలో దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు ఏపీఐఏసీకి ప్రభుత్వ భూములను బదలాయించడం జరిగింది. కానీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఆయన తనయుడు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పట్టుదలతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలని దృఢ సంకల్పంతో ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా పలుమార్లు చెన్నైలోని పారిశ్రామిక వేత్తలను కలవడం జరిగింది.

అలాగే పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శితో పాటు అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తి మేరకు వారంతా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన శాసన సభ సమావేశాల్లో గాలి భానుప్రకాష్ మాట్లాడడం మండల ప్రజానీకం హర్షం వ్యక్తం చేసింది. ఈ ప్రాంత అభివృద్ధికి,యువతకు ఉద్యోగాల కల్పనకు ఆయన కృషి ప్రశంసనీయమని పలువురు వ్యక్తం చేశారు.

## గుర్తుతెలియని వ్యక్తుల దాడి - ఒకరు మృతి

**బంగారుపాళ్యం, నవంబర్ 20 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లి గ్రామ సమీపంలో మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రాత్రి జంబువారిపల్లి శాంతినగర్ నందు వాటర్ మెన్‌గా పని చేస్తున్న కృష్ణమూర్తి(52) ఈ దాడిలో మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తులు కృష్ణమూర్తిపై ఆదివారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సోమవారం ఉదయం మామిడి తోపులో పడివున్న కృష్ణమూర్తిని సమీప రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి కృష్ణమూర్తిని తరలించారు. మెరుగైన వైద్యం కోసం కృష్ణమూర్తిని తమిళనాడు రాణిపేట సిఎంసి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం కృష్ణమూర్తి మృతి చెందాడు. ఇతను గ్రామ పంచాయతీ నందు 20 సంవత్సరాలుగా వాటర్ మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు, భార్యవున్నారు. ఈమేరకు బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన విజయానందరెడ్డి



**చిత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త:** చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ విజయనం దరెడ్డి బుధవారం విజయవాడలోని వైకాపా క్యాంపు కార్యాలయంలో వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైకాపా పరిస్థితిని పార్టీ ఇన్‌ఛార్జీ విజయానందరెడ్డిని పార్టీ అధినేత వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంసి వవిజయానందరెడ్డి నియోజకవర్గ పరిధిలోని పార్టీ స్థితిగతులను పార్టీ అధినేతకు వివరించారు.

## ఆసుపత్రుల్లో నాణ్యత ప్రమాణాలు

**చిత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యాతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా స్థాయి ఆసుపత్రుల ప్రమాణాలపై డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో ప్రజలకు సకాలంలో వైద్య సేవ అందించడానికి వైద్య ఆరోగ్య శాఖ వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. అలాగే ఆసుపత్రుల్లో సరైన ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో నిరుపయోగమైన వ్యర్థాలను తొలగించడానికి సరైన విధానంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో అనుకోని ప్రమాదాలు ఏర్పడితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని నివారించడానికి అవసరమైన భద్రతా ప్రమాణాలు సరి చూసుకోవాలన్నారు.

## పట్టపగలే కలప అక్రమ రవాణా



**శాంతిపురం, నవంబర్ 20 ప్రభాతవార్త**

శాంతిపురం మండలంలో పట్టపగలే కలప అక్రమ రవాణా జరుగుతోంది. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అనుమతులు లేకుండా కొంతమంది కలప వ్యాపారులు ఇష్టారాజ్యంగా చెట్లను నరికేయడం వాటిని ఇటుక బట్టీలకు అక్రమ ంగా తరలించడం లేదా కర్ణాటకలోని సామిల్లకు తరలించడం చోటు చేసుకుంటోంది. దీంతో పచ్చటి వృక్షాలు నేలకూలుతున్నాయి. అసలే ఓ వైపు వర్షాలు లేక కరువు పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఇలా పచ్చటి చెట్లను సైతం కలప వ్యాపారులు హరించివేయడం బాధాకరమని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎంపిడిఓచే మధ్యాహ్న భోజనం తనిఖీ



**పెద్దపంజాణి, నవంబర్ 20 ప్రభాతవార్త** మండలంలోని కోగిలేరు యుపి స్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపిడిఓ బాలాజీ తనిఖీ చేశారు. భోజనం నాణ్యత గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వంటపాత్రలు శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల జనన ధృవీకరణ పత్రాల మంజూరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే 69మంది విద్యార్థులకు గాను 60మందికి అపార్ రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు మిగతా వారికి కూడా పూర్తి చేయాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఓ ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లోకేష్, కార్యదర్శి సుజాత, తేజస్వివాణి, ఉపాధ్యాయులు శారదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



**పాలసముద్రం, నవంబర్ 20 ప్రభాతవార్త:** మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ రామలింగాఉరం బస్టాండ్ ఆవరణలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదస్థితిలో వుంది. ఈ విద్యుత్ స్తంభం కింది నుండి పై వరకు అంచులు విరిగిపోయి చువ్వలు తేలి వుంటంతో ఎప్పుడైనా కూలిపోవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు. బలిజకండ్రిగ-చిత్తూరు రహదారిలో ఈ గ్రామం వుండటంతో బలమైన గాలులు విస్తే స్తంభం రోడ్డుపై పడే అవకాశం వుంది. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఇలాంటి దుస్థితిలో వుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో ట్రాన్స్‌కో అధికారులు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## ఆధునిక పద్ధతుల్లో లాభసాటి వ్యవసాయం

**పూతలపట్టు, నవంబర్ 20 ప్రభాతవార్త:**

రైతులు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం సాగు చేసి అధిక లాభాలు ఆర్జించాలని మండల వ్యవసాయ అధికారి మధురవాణి అన్నారు. మండలంలోని గాండ్లపల్లి గ్రామంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ పనుల కోసం రైతులు ఆధునిక యంత్రాలను ఉపయోగించాలన్నారు. ఆధునిక యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం రైతుకు సబ్సిడీ ఇస్తోందన్నారు. సీడర్ పద్ధతిలో వరి సాగు చేయడం ద్వారా రైతుకు ఖర్చు తగ్గి లాభాలు ఎక్కువ వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలలో వ్యవసాయ విస్తరణ అధికారి నీలిమ, విఎస్ఎ హేమ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్‌విండో బ్యాంక్ ద్వారా రైతులకు విరివిగా పంటరుణాలు



**కుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త** కుప్పంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ద్వారా ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు విరివిగా పంట రుణాలు మంజూరు చేయనున్నట్లు సహాయ రిజిస్ట్రార్ ఆనందం, పిఐసిపి మురళీమోహన్, పిఎసిఎస్ సిఇఒ రాజే ంద్ర పేర్కొన్నారు. బుధవారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా సింగిల్‌విండో కార్యాలయంలో సహకార ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిఎసిఎస్ ద్వారా రైతులకు ఎరువులు, క్రిమిస ంహారక మందులు సరఫరాతో పాటు బంగారం, పంట రుణాలు, దీర ్ఘకాలిక రుణాలు అందించడంతో పాటు రైతుల ఆర్థిక పరిపుష్టికి తగు సహకారం అందించడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలోబిల్డింగ్ సొసైటీ మేనేజర్ రాము, గుడుపల్లె పిఎసిఎస్ సిఇఒ దిలీప్, కుప్పం డిసిసిబి బ్యాంక్ సూపర్‌వైజర్ జయప్రకాష్, రెస్కో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి వేడుకలు



**కుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త**

మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో టిప్పు బాయ్స్ అధ్వర్యంలో టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, మైనార్టీ నేత ఫైరోజ్, మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, నేతలు నబీ ఉల్లా, సర్దార్, అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మైసూరు సామ్రాజ్యాన్ని పరిపాలించిన టిప్పు సుల్తాన్ గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. స్వాత ంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారన్నారు. చివరకు బ్రిటీష్ వారితో పోరాట చేస్తూ అమరవీరుడయ్యారని పేర్కొన్నారు. టిప్పు సుల్తాన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో ఉమేర్, ఇర్ఫాన్, జాలు, ఖాసీం, ఇమ్రాన్, సలీం, అస్లం, అంజద్, ఫరూక్, అఫ్రోజ్, అక్మల్ పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు జ్ఞానప్రసాద కేంద్రాలు



**కుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త** గ్రంథాలయాలు జ్ఞానాన్ని ప్రసాదించే కేంద్రాలు అని ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాలు మంచి నేస్తాలు అని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన 150మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు సోగడబల్ల వసుదైక కుటుంబం సంస్థ, కుప్పం పెప్సీ డీలర్ రాధా కుమార్, మీనాకుమారిలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపినాథ్, లయన్స్ క్లబ్ సలహాదారు డా॥ మహేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, గ్రంథాలయ అధికారిణి సత్యవాణి, ఉపాధ్యాయులు అమరజ్యోతి, సుబ్బరాం, లయన్స్‌క్లబ్ సభ్యులు సెల్వ ం, ప్రసాద్, కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



**కుప్పంరూరల్, నవంబర్ 20 ప్రభాతవార్త** రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ఆదేశాలతో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బోద గుట్టపల్లి, చిన్న బొగ్గుపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఈసందర్భంగా రీసర్వేలో తలెత్తిన భూ సమస్యలపై పలువురు రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెకె సంతోష్, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి చెక్కునత్తం మణి, నాగరాజ్, విఆర్వో మహేష్, సర్వేయర్ గణేష్, బాలు పాల్గొన్నారు.

## వైకాపా నేతచే డి.సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



**రామకుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త**

మండలంలోని గాంధీనగర్‌కు చెందిన వైకాపా నేతచే జనసైనికులు డి.సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. ఇదేంటి అని ఆశ్చర్యపోతున్నారా.. అయితే ఇది చదవండి.. గాంధీనగర్‌కు చెందిన వైకాపా నేత రమణ డి.సిఎం పవన్ కళ్యాణ్, అతని కుటుంబీకులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టాడు. బుధవారం రామకుప్పంలో జనసైనికులు ఈ విషయంగా రమణను నిలదీశారు. మద్యం మత్తులో తాను ఇలా చేశానని రమణ పేర్కొంటూ తనను క్షమించాలని కోరాడు. అయితే సంతృప్తి చెందని జనసైనికులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట రమణచే డి.సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. తమ పార్టీ అధినేతపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తగు గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు.

## రూ.20 వేల గంజాయి స్వాధీనం



**చిత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త:** చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇరువారం నీవానది బ్రిడ్జి సమీపంలో కార్పొరేటర్ అశోక్‌కు చెందిన స్థలంలో బుధవారం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో గంజాయి విక్రయాలపై టుటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో తన ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్, మహిళా ఎస్ఐ సుగుణ, సిబ్బంది కలిసి మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో అక్కడ గంజాయి విక్రయిస్తున్న ప్రశాంత్‌నగర్‌కు చెందిన అల్లాబక్ష్(36), ఇరువారంకు చెందిన తులసీ(22), న్యూప్రశాంత్‌నగర్‌కు చెందిన సురేష్(29)లను అరెస్టు చేసి వారి నుండి 1.295 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ప్రశాంత్ నగర్‌లో ప్రస్తుతం నివాసం వుంటున్న అల్లాబక్ష్ కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కెఆర్ పురం కితగనూరు కాలనీకి చెందిన వాడని ఇతను వైజాగ్ ఏజెన్సీ ఏరియా నుండి గంజాయిని అక్రమంగా తరలిస్తుంటాడని ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య వెల్లడించారు. తులసీ, సురేష్‌లు అల్లాబక్ష్ నుండి గంజాయిని కొనుగోలు చేసి పరిసర ప్రాంతాల్లోని యువతకు విక్రయిస్తారని తెలిపారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య వెల్లడించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించిన విద్యార్థులు



**చిత్తూరురూరల్, నవంబరు 20 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, నగరపాలక సంస్థ ఆద్వర్యంలో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆర్‌కె విద్యాలయ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సపోర్టు సంస్థ అధ్యక్షులు జోసఫ్‌రాజు వృద్ధులు, వికలాంగులు, అనాధలు, వసతిలేని నిరాశ్రయులకు వసతి గృహంలో వసతి కల్పిస్తున్నామని, విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు తల్లి దండ్రులతో ప్రేమగా మెలగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు వసతిగృహంలోని నిరాశ్రయులతో అప్యాయంగా మాట్లాడి అక్కడ వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలు సుకొన్నారు. కళాశాలవైస్‌ప్రిన్సి పాల్‌అజయ్‌కుమార్, వసతిగృహ సిబ్బంది శశిరేఖ, శ్రీనివాస సెల్వి పాల్గొన్నారు.

## ద్రౌపదీదేవి కళ్యాణం కమనీయం



**వెదురుకుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త :** శ్రీకృష్ణ ధర్మరాజుల సమేత ద్రౌపదీ దేవి కళ్యాణ వేడుకలు కన్నులపండువగా వైభవపేతం బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలో వేలసిన శ్రీకృష్ణ ధర్మరాజుల సమేత ద్రౌపదమ్మ వారి ఆలయంలో మహా సంప్రోక్షణ పూజలలో భాగంగా ఉదయం యాయవరం గౌరీశంకర్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల ఆధ్వర్యంలో కలశపూజ, మూలవర్లకు కలశస్థాపన పూజ, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో చేపట్టారు. అనంతరం మహాసంప్రోక్షణ, హోమంతదితర కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, దంపతులు పాల్గొన్నారు. 11 గంటలకు పురోహితుల వేదమంత్రాల మధ్య వైభవంగా కళ్యాణం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేట నీరజారాధాకృష్ణా రెడ్డి, మాజీ ధర్మకర్త ఉమాపతి రెడ్డి, ఆలయ ముఖ్యకార్యనిర్వహకులు ఆంజనేయులు రెడ్డి, కృష్ణా రెడ్డి, నరసింహా రెడ్డి, జయరాం, ఆనంద రెడ్డి, జయరామ రెడ్డి, జీవన్‌బాబు, సభాపతి రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు తదతరులు పాల్గొన్నారు.

## ఇష్టంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమిద్దాం : డిపిఓ



**చౌడేపల్లి, నవంబర్ 20 ప్రభాతవార్త** ఇష్టంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమిద్దామని జిల్లా పంచాయతీ అధికారిణి బి.పార్వతి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో పంచాయతీ, సచివాలయ కార్యద ర్శులతో సమావేశం జరిగింది. గ్రామీణాభివృద్ధిలో పంచా యతీ కార్యదర్శులది కీలకపాత్రన్నారు. ప్రజలకు అందుబాటులో వుండి వారి సమస్యల సాధనకు పాటు పడాలన్నారు. ముఖ్యంగా మంచినీరు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వమందించే సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించాలని సూచించారు. అనంతరం పంచాయతీరాజ్ చట్టంలో కార్యదర్శుల పనితీరును వివరించారు. చౌడేపల్లి, సోమల ఎంపిడిఓలు లీలామాధవి, నారాయణ, ఇఓ ఆర్డీలు కృష్ణవేణి, లక్ష్మీదేవి, మండలంలోని పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## టార్బాలిన్ పట్టలను సద్వినియోగం చేసుకోవాలి : ఎపిఎం



**చౌడేపల్లి, నవంబర్ 20 ప్రభాతవార్త** ప్రభుత్వమందిస్తున్న టార్బాలిన్ పట్టలను రైతులు సద్వి నియోగం చేసుకోవాలని ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం అన్నారు. బుధవారం రైతు ఉత్పత్తిదారుల సంస్థచే తెబడిన టార్బాలిన్ పట్టలను రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఆయన పంపిణీ చేసారు. మార్కెట్‌లో కంటే నాణ్యమైన టార్బాలిన్‌ను తక్కువ ధర రూ. 2వేలకు ప్రభుత్వమందిస్తోందన్నారు. వరికోత దశలో వున్నందున రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. ఐకెపి సిసిలు, రైతులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజ



**కల్లూరు, నవంబర్ 20, ప్రభాతవార్త**

పులిచెర్ల మండలంలోని కురుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శ్రీ అయ్యప్ప స్వామి పూజను భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి నామ స్మరణతో నిర్వహించారు. భక్తులు స్వామివారి తీర్ధ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ స్వీకరించారు. గురు స్వామి రాజశేఖర్ దీక్షితులు, మల్లేశ్వర స్వామి దీక్షితు లు, చంద్రశేఖర్ స్వామి, రవిస్వామి , ఎల్లయ్య స్వామి, పూజా నిర్వహించారు. ఉభయ దారులుగా వీరప్ప కుటుంబ సభ్యులు భక్తులు వ్యవహరించారు.

## అసెంబ్లీలో వడ్డెరల సమస్యలపై ప్రస్తావించడం అభినందనీయం

**తవణంపల్లె, నవంబర్ 20 ప్రభాతవార్త:** ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని వడ్డెరల స్థితిగతులు, సమస్యలపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రస్తావిస్తూ అన్ని రంగాలలో వెనుకబడిన వడ్డెరలను ఎస్టీల జాబితాల్లో చేర్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం అభినంద నీయమని వడ్డెర విజయబేరి అధ్యక్షుడు బండా రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డెరలను ఎస్టీల జాబితాల్లో చేర్చాలనే సత్యపాల్ కమిటిని గత వైకాపా ప్రభుత్వం తుంగలో తొక్కిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని వడ్డెరలను ఎస్టీల జాబితాల్లో చేర్చేందుకు అసెంబ్లీలో బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపాలని బండా రామచంద్రయ్య కోరారు.

## లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



**కాణిపాకం, నవంబర్ 20 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. బుధవారం కాణిపాకంలో లాడ్జీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లాడ్జీ వద్ద భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పా టు చేసుకోవాలన్నారు. లాడ్జీల్లో గదులు అద్దెకు తీసుకునే వారి వివరాలకు సంభందించి గుర్తింపు కార్డులను తీసుకోవాలని, అనుమానితుల కదలికలు వుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై ధరణీధర తెలిపారు. ఈసమావేశంలో చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీదర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీధర, లాడ్జీ యజమానులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భూ కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోండి



**తిరుపతి హెల్త్, నవంబర్ 20, ప్రభాతవార్త** ఎంఆర్ పల్లి సమీపంలోని గాంధీపురంలో సర్వేనెంబర్ 15 లో ఉన్న తమ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న యశోద పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితుడు రాజేశ్వరరావు వేడుకున్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ. తాను తన భార్య యూనివర్సిటీలో పనిచేసి పదవి విరమణ పొందామని, తన భార్యకు వచ్చిన డబ్బుతో 2006 సంవత్సరంలో సదరు సర్వే నెంబరులోని 140 అంకణాలు భూమిని పద్మనాభ ఆచారి వద్ద కొనుగోలు చేశామన్నారు. అప్పుడు రిజిస్ట్రేషన్ లేకపోవడంతో 2016లో కోర్టు ఆదేశాల మేరకు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని అక్కడ షెడ్డు నిర్మించామన్నారు. కరెంటు సర్వీసు కూడా తీసుకున్నామన్నారు. అయితే ధర్మవరం చెందిన యశోద 2020లో తాను పరిశ్రమ ఏర్పాటుకు స్థలం అద్దెకి ఇవ్వాలని కోరగా నెల నెలఅద్దె మేరకు 11 నెలలు లీజుకు అగ్రిమెంటు చేసి ఇచ్చామన్నారు. లీజు సమయం దాటిపోయిన నా స్థలం ఖాళీ చేయలేదన్నారు. అంతేగాక వాళ్ల పిల్లల చదువు కోసం ఆరు లక్షల రూపాయలు అప్పు తీసుకుని అందుకు సంబంధించి తనకు చెక్కులు అందజేసిందన్నారు. చెక్కులు బ్యాంకులో బౌన్స్ కావడంతో కోర్టులో కేసు అన్నారు. ఇచ్చిన అప్పు చెల్లించక పోగా తమకు 20 నెలల బాడుగ డబ్బులు కూడా ఇవ్వాల్సి ఉందని తెలిపారు. తమ భూములో తిష్ట వేసి తాను ఖాళీ చేయనంటూ తమపై దౌర్జన్యానికి దిగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసు కేసు కూడా పెట్టడం జరిగిందని తెలిపారు. అయినా భూములోకి తమను రాకుండా అడ్డుకుంటుందని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ నాయకుడు పెంచలయ్య పాల్గొన్నారు.

## ఆకాశదీపాన్ని ఆవిష్కరించిన ఎఇఓ



**కాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త**

ఆకాశదీపాన్ని ఆలయ ఆవరణలో బుధవారం ఎఇఓ లోకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వరా లయంలో కార్తీక మాసం సందర్భంగా కోట మండపం వద్ద ప్రతిరోజూ సాయంత్రం వేళ ప్రత్యేక స్థంభంపై ఆకాశ దీపాన్ని ఆవిష్కరించటం జరుగుతుంది. ఈ నేపథ్యం లో వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆలయ పొరోహితులు అర్ధగిరి స్వామి శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయ బద్దంగా ఆవిష్కరింపజేసారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఓ హేమామాలిని టెంపుల్ ఇన్సెపెక్టర్ సురేష్‌రెడ్డి, నాగయ్య, తదితరులుపాల్గొనగా లోకేష్‌రెడ్డి దీపాన్ని ఆవిష్కరించారు. తెలుగుదేశం నాయకుడు మధు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయానికి ఆర్‌ఐలు కావలెను?



**శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లేక పలువురు ప్రజలతో పాటు కార్యాలయానికి ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నుంచి ఆర్‌ఐలు రిలీవ్ అయ్యారు. అయితే వీరి స్థానంలో కొత్తగా ఎవ్వరినీ నియమించకపోవడంతో పలువురు ప్రజలు వివిధ సర్టిఫికెట్లుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి కార్యాలయంలో అందరికీ సుపరిచితుడైన కుప్పయ్యను సంప్రదించి పనులు చేయించుకుంటున్నారు. ప్రస్తుతం జెఈఈ పరీక్షలకు విద్యార్థులకు ఈబిసి, లేక ఓబిసి సర్టిఫికెట్లు కావాల్సి ఉండగా వీరితో పాటు ఆదాయ, కులధృవీకరణ సర్టిఫికెట్లు మంజూరు చేయాల్సి ఉంది. అయితే కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో విఆర్‌ఓల లాగిన్ వరకే పరిమితమవుతోంది. ఇక ఫ్యామిలీ సభ్యుల సర్టిఫికెట్లు, ఎంజాయ్‌మెంట్‌సర్టిఫికెట్లు గత కొద్ది నెలలుగా కేవలం కాగితాలకే పరిమితవుతున్నాయి. ఆర్‌ఐలతో పాటు ఆర్‌ఎస్‌డిటి కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కార్యాలయం మిద్దెపైన విఆర్‌ఓలకు శిక్షణ ఇస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయానికి ఆర్‌ఐలను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## బాలికల వసతిగృహంలో సమస్యను పరిష్కరించిన జనసేన



**శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త**

గిరిజన బాలికల వసతిగృహంలో మరో సమస్యను జనసేన ఇన్‌ఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. గురుకులానికి ప్రహరీగోడ లేకపోవడంతో బయటనుంచి ఆకతాయిలు, మందుబాబులు వచ్చి ఇబ్బంది పెడుతున్నారని హాస్టల్ బాలికలు వినుతకు తెలిపడంతో సొంత ఖర్చుతో ప్రహరీగోడ, గేటును మూసివేయించి వారి సమస్యను పరిష్కరించారు. లైట్లు సమస్య కూడా ఇదివరకే పరిష్కరించిన సంగతి తెలిసిందే. ఇతర సమస్యలు జిల్లా కలెక్టర్‌కు స్థానిక ఎంఎల్ఏకు తెలిపామన్నారు.

## దళిత పారిశ్రామిక వేత్తలను చేయూతనివ్వండి

**శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో నూతన ఔత్సాహిక పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందించాలని డిపిఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) నాయకుడు నత్తం హరిబాబు కోరారు. విజయవాడలోని మాకినేని భవన్‌లో బుధవారం నూతన ఔత్సాహిత పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహక సదస్సు దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలకు అనుకూల ప్రదేశమని ఇక్కడకు పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఇది నిరుద్యోగులకు ఎంతోమందికి ఉపాధి కలుగుతుందన్నారు. ఈసందర్భంగా హరిబాబు తిరుమల లడ్డు ప్రసాదాలును అందించారు.

## పాఠశాలల పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి..ఏపిటిఎఫ్



**తొట్టంబేడు, నవంబర్ 20 ప్రభాతవార్త** అశాస్త్రీయమైన పాఠశాలల పనిగంటల పెంపును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపిటిఎఫ్ తిరుపతిశాఖ జిల్లా అధ్యక్షులు బి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశా లలు పనిగంటలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పొడిగించడం అశాస్త్రీయమని ఏపిటిఎఫ్ తిరుపతి జిల్లాశాఖ అధ్యక్ష్య, ప్రధాన కార్యదర్శి బి.మురళీకృష్ణ, బి.బాలసుబ్రమణ్యంలు అన్నారు. విద్యాశాఖ అధికారులు ఆదేశాలతో పైలట్ ప్రాజెక్టు ఒక ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పెంచడం విద్యార్థులకు మేలు చేయకపోగా విశ్రాంతి లేకుండా విద్యా ప్రగతి కుటుంపడుతోందన్నారు. ఉపాధ్యాయులకు నిర్విరామంగా 8గంటలకు మించి బోధనా తరగతులు ఉంటే బోధనా ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పాఠశాలల పనివేళలు పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపిటిఎఫ్ తిరుపతి జిల్లాశాఖ డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఎంపిపీ పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన పెద్దిరెడ్డి



**రొంపిచెర్ల, నవంబర్ 20, ప్రభాతవార్త**

ఎంపిపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి లు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తల్లి చిచ్చిలి చెంగమ్మ పాల కార్యక్రమానికి హాజరు అయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను, ఎంపిపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డిని, సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిచ్చిలి చెంగమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చిచ్చిలి చెంగమ్మ మృతి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపిపీ నూలు రెడ్డెప్ప, వైఎస్‌ఆర్సీపీ నాయకులు రాం ప్రసాద్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, నాగిరెడ్డి, ప్రసాద్ నాయుడు, గుండ్లూరు రామచంద్రా రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, శ్రీనాధ నాయుడు, బాలాజీ, కోటా వెంకటరమణ, భాస్కర్ రెడ్డి, రకీబ్, అల్లాబక్షు, ఎల్. మహబూబ్ బాషా, హరిక్రిష్ణా రెడ్డి, సురేంద్ర నాయుడు, బాబు, బషీర్, కుమార్ రెడ్డి, గురు, ఉమాపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు : సిఐ



గూడూరు, నవంబర్ 20 ప్రభాతవార్త: ట్రాఫిక్ నియమాలను పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పోలీసు, పురపాలక శాఖ ధికారులు, సిబ్బంది కలిసి వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శేఖర్ బాబు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉన్నందున అవగాహన కల్పించామన్నారు. ఎవరైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు, పోలీసులు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు పట్టివేత



వాకాడు, నవంబర్ 20 ప్రభాతవార్త: అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎస్ కే కాలేషా సత్తార్ ఇంట్లో 12 మద్యం బాటిల్లను వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ బృందంతో వెళ్లి పట్టుకున్నారు. బుధవారం పుచ్చలపల్లి గ్రామంలోని వాకాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ప్రసాద్ సమాచారంతో బృందంతో వెళ్లి అక్రమంగా అమ్ముతున్న షేక్ కాలేషా సత్తార్ వద్ద 12మద్యం బాటిల్లను పట్టుకొని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ వెంకటేశ్వర్లు, రమణయ్య, పోలయ్య తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులకు ఆంగ్లం, సోషల్‌పై శిక్షణ



బాలాయపల్లి, నవంబర్ 20 ప్రభాతవార్త : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ఇంగ్లీష్, సోషల్ మాధ్యమాలపై రిసోర్స్ పర్సన్స్ గంగారామ్, ఎం.వి. నారాయణలు శిక్షణ ఇచ్చారు. సమగ్ర శిక్ష స్కూల్ కాంప్లెక్స్ శిక్షణలో భాగంగా ప్రత్యేకంగా ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల నవీకరణ, పాఠశాలలో వనరుల వినియోగం పై శిక్షణ ఇచ్చారు. బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ జరిగింది. పి.ఎం.విద్య వైభవ్, పొగాకు రహిత విద్యాసంస్థలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో హెచ్ఎం లలిత శివజ్యోతి, రిసోర్స్ పర్సన్ లు మల్లికార్జున, ప్రభుత్వ, ఎయిడెడ్, కెజిబివి పాఠశాలలు, రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



చిల్లకూరు, నవంబర్ 20 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని కడివేడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై ఏపిసిఎన్ఎఫ్ (ఆర్‌వైఎస్ఎస్) నుండి కన్సల్టెంట్ జమున, జెండర్ టిఎల్ భాగ్యలక్ష్మిలు అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి జిల్లా నుండి అడిషనల్ డిపిఎం పటాభిరెడ్డి, డిప రవిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 365 రోజులు కిచెన్ గార్డెన్‌ను, ఏటిఎం మెడల్‌లు, ఏ గ్రేడ్ మెడల్, డిఆర్‌పి మెడల్ ఇన్‌పుట్ తయారీ విధానం, రాజీలేని సూత్రాలు గురించి వివరించి టైప్ 1 ఘణ, జీవామృతం 200కేజీలు తయారు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ గీతారాణి, డిఎంఎంటి వీరగానయ్య, మండల ఇన్చార్జి పూర్ణిమ, గ్రామ పెద్దలు శ్రీనివాసులు రెడ్డి, ఉప సర్పంచ్ మధుసూధన్ రెడ్డి, సిసిలు, విఓఎలు, ఓబిలు, ఎపిసిఎన్ఎఫ్ క్యాడర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదానీ ఫౌండేషన్‌చే రైతులతో ప్రత్యేక సమావేశం



చిల్లకూరు, నవంబర్ 20 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామ పరిధిలో ఉన్నటువంటి కృష్ణపట్నం పోర్ట్ కృష్ణపట్నం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, ఆదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, ఆదానీ ఫౌండేషన్ సంయుక్తంగా రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక సమావేశం సోమవారం టౌన్ హాల్ బిల్డింగ్, ప్రాజెక్ట్ కార్యాలయం, ఆదానీ కృష్ణపట్నం పోర్ట్ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ హాజరై, రైతులకు స్ప్రేయర్లను పంపిణీ చేసారు. అలాగే, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. వారు ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఆదానీ ఫౌండేషన్ తరఫున హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ రాజేష్ రంజన్, సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డా. రమేష్ బాబు, అరుణ్, రవీంద్ర, షైక్ షాహుల్ హమీద్, వ్యవసాయ చీఫ్ మెంటర్ డా. ఆర్. సెల్వరాజ్, రైతులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్ప్రేయర్లు, జిప్సం బస్తాలు, కిచెన్ గార్డెన్ విత్తన ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు, వ్యవసాయ యంత్రాల ప్రదర్శన కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా కృష్ణపట్నం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా రైతుల అభ్యున్నతి కోసం ప్రగతి దిశగా ముందడుగు వేసింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కృషి సహాయ సంచాలకులు గోపి నాయక్, ఉద్యాన శాఖ అధికారి కార్తిక్, వ్యవసాయ అధికారి భవాని, మైక్రో ఇరిగేషన్ అధికారి సాంధ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు నాసిఫా, విజయ, వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

కోట, నవంబర్ 20 ప్రభాతవార్త : కోటలోని ఆర్టీసీ షాపింగ్ దుకాణదారులు ప్రతి నెలా విద్యుత్ బకాయిలు చెల్లిస్తున్న దుకాణాలకు సర్వీసులను అక్రమంగా తొలగించారని, ఆ శాఖ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని దుకాణదారులు బుధవారం కోట పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుకాణదారులు మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న స్థలాల్లో ఆర్టీసీ వారి వద్ద చిరు వ్యాపారులు నెలనెలా బాడుగలకు తీసుకొని సొంత ఖర్చులతో గదులు నిర్మించుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఆ మేరకు ఆర్టీసీ వారికి అద్దెలు, ఇటు విద్యుత్‌శాఖకు నెలనెలా బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. పంచాయతీకి, ఆర్టీసీ వారికి కోట కోర్టులో వివాదం జరిగి ఆర్టీసీ వారికి చెల్లిస్తున్న బాడుగలను పంచాయతీకి చెల్లించాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఆ తీర్పు ప్రకారం పంచాయతీకి సక్రమంగా బాడుగలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. గత కొన్నిరోజులుగా దుకాణదారులకు పంచాయతీ అధికారులకు బాడుగల పెంపుదలపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ వారు గాని, విద్యుత్‌శాఖ అధికారులు గాని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ దుకాణాలకు విద్యుత్ సర్వీసులు తొలగించారని ఆరోపించారు. విద్యుత్‌శాఖ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని దుకాణదారులు విజ్ఞప్తి చేశారు.

**నష్ట పరిహారం ఇవ్వండి.. రోడ్డు వేసుకోండి:**

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో గత రెండేళ్లుగా సాగరమాల రోడ్డు నిర్మాణం చేపట్టి, భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా రోడ్డు వేసేందుకు అధికారులు ముందు కొస్తున్నారని రైతులు బుధవారం తహశీల్దార్ జయజయరావు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామానికి తహశీల్దార్ జయజయరావు రైతులతో చర్చలు జరిపేందుకు వెళ్లారు. దీంతో తమను రెండేళ్ల నుంచి పరిహారం ఇవ్వకుండా రోడ్డు వేస్తామని సాగరమాల కంపెనీ ప్రతినిధులు చెప్పడం సబబు కాదన్నారు. తమకు ముందుగా పరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు వేసుకుంటే మంచిదన్నారు.

## బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి:ఎఓ



నాయుడుపేట టౌన్, నవంబరు 20 ప్రభాతవార్త : గ్రామాల్లో వ్యవసాయం సాగు చేపట్టే ప్రతిరైతు తప్పనిసరిగా పంటబీమా పథకమును సద్వినియాగం చేసుకోవాలని నాయుడుపేట ఎఓ గణేష్ తెలిపారు. ఆయన బుధవారం నాయుడుపేట మండలంలోని విన్నమాల, కారుమంచివారి కండ్రిగ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధి కారి గణేష్ మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న పంటల బీమా పథకాన్ని గ్రామాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరైతు దగ్గరలో ఉన్న మీసేవా-బ్యాంక్‌లో డిసెంబరు 31తేది లోపల చెల్లించి వారిపేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన రైతులకు వ్యవసాయ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు తెలియ జేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, తదితరులు ఉన్నారు.

**పేటలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు:**

నాయుడుపేట పట్టణంలోని దర్గసెంటరులో ఉన్న గ్రంథాలయంలో అధికారులు గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలు చివరిరోజు సందర్భంగా విజన్, జడ్‌పి, భాషా హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు భాషా స్కూల్ ప్రిన్సిపాల్ హామిద్ చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీయన్ అతావుల్లా, ఉపాధ్యాయులు సాయిరామ్, రమేష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన, కుంకుమార్చనలు



శ్రీకాళహస్తి, నవంబర్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో నిర్వహించే స్వామికు లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలంంకార మండపాన్ని చక్కగా పూల సోబగులు కల్పించారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన జోగా పోలయ్య కుటుంబసభ్యులతో హాజరై 400 కిలోల నాణ్యమైన కుంకుమను అందించారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ స్థానం కుటుంబం నుంచి అచ్చితా గురుకుల్, ఆలయ ఉప ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, పారోహితులు అర్ధగిరి, వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా మొదటి పూజలు అందించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ స్వామినాధన్‌తో పాటు అచ్చితా గురుకుల్, వరదా గురుకుల్, రాజేష్ గురుకుల్, సురేష్ గురుకుల్, నిరంజన్ గురుకుల్, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏర్పాట్లను ఎఇఒ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

## సమిష్టి విధులతో ప్రజలకు మెరుగైన సేవలదించండి

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 20 ప్రభాతవార్త : పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్.పి ఎల్. సుబ్బ రాయుడు సూచనల మేరకు రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ యం.మహేష్ కుమార్ హోంగార్డ్ దర్బార్‌ను నిర్వహించారు. జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో బుధవారం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సూచనలతో కర్నూలు రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ హోంగార్డుల పరేడ్‌ను తిలకించి అనంతరం దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ హోంగార్డ సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని, ఇప్పుడున్న మీ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. హోంగార్డ్స్ సంక్షేమంలో భాగంగా పలు చర్యలను జిల్లా ఎస్పీ సూచనలతో తీసుకుంటున్నామని కమాండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్. డీఎస్పీ చిరంజీవి, ఏఆర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్. ఎస్. పోతల రాజు, సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్చార్జిలు ప్రేమానంద, శేఖర్, డీఎస్పీ రైటర్ అనంతరావు, ఆర్.ఐ రైటర్ సతీష్, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

## కారిడార్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి : కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 20 ప్రభాతవార్త : వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో వివిధ పారిశ్రామిక వాడలకు కావలసిన నీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి 05) అభివృద్ధి పనులలో భాగంగా వివిధ పారిశ్రామిక వాడలకు కావలసిన నీటి సరఫరా పైపులైన్‌ల పనులను వేగవంతం చేయాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, కాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వీర శేఖర్ రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకో పుంగనూరూ!



పుంగనూరు, నవంబరు 20 ప్రభాతవార్త : నిరంకుశ పాలనతో ఇంతకాలం స్వాతంత్ర్యం లేకుండా బతికిన పుంగనూరు ప్రజలు ఇపుడు జనసేనకు కొత్త నాయకత్వం రాకతో స్వేచ్ఛగా ఊపిరి తీసుకోవాలని, దమ్మున్న వేణుగోపాల్‌రెడ్డి నాయకత్వంలో విజృంభించాలని ఉమ్మడి జిల్లాల జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. బుధవారం వేణుగోపాల్‌రెడ్డి స్వగ్రామం చదళ్ళలో భారీ సంఖ్యలో వైకాపా కార్యకర్తలు జనసేన కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఇంతకాలం ప్రజలను, ఎదిరించిన వాళ్ళను తొక్కేసిన వైకాపాకు సరైన సమాధానం చెప్పే దమ్మున్న వేణుగోపాల్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలన్నారు. వేణుగోపాల్‌రెడ్డి, హరిప్రసాద్‌ల సమక్షంలో పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల ప్రాంతాల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో శ్రీచౌడేశ్వరి ఫంక్షన్ హాల్ క్రిక్కిరిసిపోయింది. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, ఎన్వీఆర్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డిలతో పాటూ వందలాదిగా జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుమలలో బుధవారం అడిషనల్ ఈవో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం
-ప్రభాతవార్త, తిరుమల

## మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసిన ఎంఈవో

డక్కిలి, నవంబరు 20 ప్రభాతవార్త: డక్కిలి మండలంలోని తీర్థంపాడు ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట చేస్తున్న నిర్వాహకురాలుకు ఆయన పలు సూచనలు చేశారు. భోజనం నాణ్యత విషయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంతేగాక మెనూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీ నుంచి విద్యార్థులకు వడ్డించే వరకు ఉపాధ్యా యులు పర్యవేక్షణ ఉండాలని తెలియజేశారు. అనంతరం ఆయన తీర్థంపాడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు పలు అంశాలపై సలహాలిచ్చారు.

## పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

కోట, నవంబర్ 20 ప్రభాతవార్త : రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ కోరారు. బుధవారం కోట మండలం రుద్రవరం, చిట్టేడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోతే అందుకు పరిహారం పొందేందుకు రబీ పంటకు 630 రూపాయలు చెల్లిస్తే 42 వేల రూపాయలు వరకు బీమా వస్తుందన్నారు. వేరుశనగ పంట సాగు చేసే వారు ఎకరాకి 450 రూపాయలు చెల్లిస్తే రూ.30వేలు బీమా పొందవచ్చని తెలిపారు. డిసెంబర్ 31లోపు రైతులు తమ పంటలను బీమా చేయించుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని, ఆధునిక పద్ధతులను అవలంబించాలని కోరారు. వ్యవసాయ సహాయకులు డి.భూషణ్, ప్రశాంతి, పశుసంవర్ధకశాఖ సహాయకులు సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక వ్యాక్సిన్



కోట, నవంబర్ 20 ప్రభాతవార్త : కోట మండల పరిధిలోని సచివాలయాల్లో బుధవారం చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్లు వేసినట్లు చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం వజ్జావారిపాలెం గ్రామంలో చిన్నపిల్లలకు వ్యాక్సిన్లు వేసే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. మండలంలో 2200 మంది చిన్న పిల్లలు ఉన్నట్లు తెలిపారు. వ్యాక్సిన్ వేసిన వెంటనే పిల్లలకు జ్వరం వస్తుందని, తల్లులు పిల్లలను వెంటనే భుజాలపై వేసుకొని తడుతూ అటు ఇటూ నెమ్మదిగా తిరిగితే పిల్లల్లో ఉత్సాహం వస్తుందన్నారు 0 నుంచి ఐదేళ్లలోపు పిల్లలు వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు.

## బీసీల జాబితాలో సంచార జాతుల వారిని కలపాలి



వెంకటగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త : సంచార జాతుల వారిని బీసీల జాబితాలో కలపాలని సంచార జాతుల మండలి రాష్ట్ర కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. సంచార జాతుల వారిని బీసీల జాబితాలో కలుపుకోవడం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. సంచార జాతుల వారికి బీసీ డిఎన్టి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. 77 సంవత్సరాల నుండి సంచార జాతుల వారికి తగు న్యాయం జరగలేదన్నారు. సంచార్జాతుల వారికి తగు న్యాయం చేయాలని మంత్రిని ఆయన కోరారు. ఫోటో

## పశు సంరక్షణపై రైతులు శ్రద్ధ చూపాలి : ఏడి

వెంకటగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త : పశు సంరక్షణ పై రైతులు తగు శ్రద్ధ చూపాలని పశువైద్య శాఖ ఏడి స్వామి బాబు తెలిపారు. మండలంలోని పట్రపల్లి ముద్దంపల్లి, గ్రామాలలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులుచే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆవులలో లంపీ స్కిన్ వ్యాధి రాకుండా ఎల్ ఎస్ డి టీకాను తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. లేనిచో వాటి వలన ఈ వ్యాధి మనుషులకు కూడా సంక్రమించే అవకాశం ఉందని తెలియజేసారు, దూడలు, మేకలు, గొర్రెలకు, రోగ నిరోధక శక్తి, బలం కొరకు డీ వార్మింగ్ (పెరుగు మందు) పోయించడం జరిగింది. పశువుల మేతకు గడ్డి విత్తనములు జొన్న, మొక్క జొన్న, రాయితీపై ఇస్తారని ఈ అవకాశము ను రైతులు వినియోగించుకోవాలని కోరారు. నిమ్మ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఈ కే నాయక్ జామ తోటలను పరిశీలించి మేలైన యాజమాన్య పద్ధతులను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామమోహన్, వి ఏ ఏ సుమతి, ఏ హెచ్ ఏ లు గోవింద్, ప్రకృతి, వ్యవసాయం సిబ్బంది కోటి, పారిజాతం, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని కలిసిన జాలర్ల నేత



తడ, నవంబర్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని తడ మండల జాలర్ల నేత, మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్ కలిసి అభినందనలు తెలిపారు. బుధవారం శ్రీధర్‌తో పాటు జైపాల్, కరుణ్ తదితరులు కోవూరు నియోజకవర్గానికి చెందిన దినేష్‌రెడ్డిని అమరావతిలో కలిసి అభినందనలు తెలిపారు.

## నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

తడ, నవంబర్ 20 ప్రభాతవార్త : ప్రపంచ మత్స్యకార దినోత్సవం గురువారం జరగనుంది. ఇందుకు జిల్లా కేంద్రం తిరుపతిలో అధికారులు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఇంతకుముందు తిరుపతి జిల్లాకు తీరప్రాంతం లేని కారణంగా తీరప్రాంతం విస్తరించిన నెల్లూరు, ఇతర జిల్లా కేంద్రాల్లో మత్స్యకార దినోత్సవం జరిపేవారు. ప్రత్యేకించి తడ మండలం పులికాట్ సరస్సు ఒడ్డున విస్తరించిన 16 జాలర్ల కుప్పాల వారిని జిల్లా అధికారులు ఆహ్వానించినట్లు తెలిసింది. జాలర్ల సంక్షేమ సంఘం నాయకులు, వివిధ పార్టీల జాలర్ల నేతలు ఈ కార్యక్రమాలకు హాజరు కానున్నారు.

## డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన రాష్ట్ర కార్యదర్శి



గూడూరు, నవంబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజును తెదేపా రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని డిప్యూటీ స్పీకర్ చాంబర్లో కలిసి బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ని విజయవాడలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గుండాల శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్ కార్యాలయాన్ని ప్రారంభం

గూడూరు, నవంబర్ 20 ప్రభాతవార్త : గూడూరు రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్ కార్యాలయాన్ని బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రారంభించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన వసతులు అందజేస్తామని వివరించారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో ఉన్న బుకింగ్ కౌంటర్‌ను జీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్ ఐజి అరోమా సింగ్ ఠాగూర్, డిఆర్ఎం నరేంద్ర పాటేల్, అధికారులు మధుసూధన్ రావు, చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ ఆరేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

వెంకటగిరి, నవంబర్ 20 ప్రభాతవార్త : గ్రంథాలయంలో వారం రోజులు పాటు జరిగిన వారోత్సవాలు ముగిశాయి. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతరైనారు వారికి ఎంఈఓ తోట వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యమై స్కూల్ హెడ్ మాస్టర్ మోహన్ కృష్ణ, గ్రంథాలయ అధికారి అంజయ్య, సహాయ ఉద్యోగి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సన్నిధిలో ఆలయ పునర్నిర్మాణ దాతలు



కాణిపాకం, నవంబర్ 20 ప్రభాతవార్త: కాణిపాకం ఆలయ పునర్నిర్మాణ దాతలు ఐకా.రవి, గొట్టిపాటి రామ కృష్ణప్రసాద్‌లు బుధవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఈఈ వెంకటనారాయణ, సూపరెండెంట్ కోదండపాణి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



రామకుప్పం, నవంబర్ 20 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదరా బర్ (మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బందార్లపల్లిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్వహించగా ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాల యాలు చుట్టూ తిరిగే పనిలేకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించేలా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఐదేళ్లలో సమస్యలు లేని గ్రామాలుగా మార్చాలన్న ఉద్దేశంతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామాలకు హాజరై సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, సిఐ మల్లేష్ యాదవ్, తహశీల్దార్ బాబు, ఎంపిడిఓ లక్ష్మీకాంత్, రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, రామూర్తి, చలపతి, సీతాపతి, ,చిన్నికృష్ణ, జయశంకర్, గంట్లప్ప గౌడు, విశ్వనాథ్, వెంకటాచల ం తదితరులు పాల్గొన్నారు.

## సవరణలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

చిత్తూరు, నవంబర్ 20 ప్రభాతవార్త: విద్యార్థులకు ఆపార్ కార్డుల మంజూరుకు సంబంధించి ఆధార్‌లో సవరణలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆపార్ జనరేషన్‌పై డిఇఒ, సమగ్ర శిక్ష ఎపిసి, డిఎల్‌డిఎ, డివైఇఒ, అర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఇఓలు, మున్సిపల్ కమీషర్లు, ఇతర సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 71.87 శాతం అపార్ జనరేషన్ పూర్తయ్యిందన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆధార్ సెంటర్లకు పంపకుండా సంబంధిత ఎంపిడిఓ, ఎంఇఓ, మొబైల్ ఆధార్ సెంటర్ ద్వారా ఆధార్ సవరణను పాఠశాల స్థాయిలో చేపట్టాలన్నారు.